క్లుప్తంగా

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారుపాప

చీపురుపల్లి: విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టినప్పుడే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని, డ్రగ్స్ లాంటి చెడు అలవాట్లకు బానిస గా మారితే జీవితాలు నాశనమైపోతాయని విజయనగరం టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారుపాప చెప్పారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వద్దు చదువే ముద్దు అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో నిరంతర ఆదాయం



మట్టిని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొంద వచ్చని ప్రకృతి వ్యవసా య రీజనల్ అధికారి కె.హేమసుందర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మెంటర్ కాసులమ్మ వ్యవసాయ క్షేత్రంలో కట్టి జనుమ, అంతర పంటలుగా అపరాలు సాగు చేస్తున్నారు. ఈ పంటలను ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్ మంగళ వారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సీజనల్‌లో ఒకే మడిలో రెండు నుంచి మూడు పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందని, భూసారాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. రైతులు బహుళ పంటల సాగుకు ముందుకు రావాలని కోరారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.కిశోర్ కుమార్, తదితరులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

గుర్ల: దొంగతనాల నియంత్రణ, నేరాల కట్టడిలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్‌ఐ పి.నారాయణరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలు అరికట్టడానికి ప్రధాన కూడళ్ల లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మహిళలు, బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి కేజీబీవీలో విద్యార్థినులకు సూచనలు చేస్తున్న జీసీడీఓ మాలతి

చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్(గరివిడి): కొద్ది రోజుల్లో జరగనున్న టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా పరీక్షలకు సమాయత్తం కావాలని కస్తూర్బా గాంధీబాలిక విద్యాల యాల్లోని (కేజీబీవీ) విద్యార్థినులకు సర్వశిక్ష అభియాన్ జీసీడీఓ పి.మాలతి సూచించారు. చీపురుపల్లి, గరివిడి కేజీబీవీలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా కిచెన్ , స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించాలన్నారు. ప్రత్యేక ప్రణాళికతో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల సమయం కావడంతో ఆరోగ్యకరమైన భోజనాన్ని తీసుకోవాలని, ఎలాంటి జంక్ ఫుడ్స్ తినకూడదని సూచించారు. ఆమె వెంట ఆయా కేజీబీవీల ఎస్‌ఓలు, ఉపాధ్యాయినులు ఉన్నారు.

మాడిపోతున్న ఆశలు



చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస వద్ద ఉన్న మామిడి తోట



గరివిడి మండలంలోని కాపుశంభాంలోని మామిడి తోటలో మంచుకు మాడిపోయిన పూత

- మామిడి రైతులను ముంచేస్తున్న మంచు
- ఫిబ్రవరి నెల పూర్తవుతున్నప్పటికీ వీడని పొగ మంచు
- మాడిపోతున్న పూత...రెండో దశ పూతపైనా ప్రభావం
- సస్యరక్షణ కోసం ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అదనపు భారం
- చీపురుపల్లి నియోజకవర్గంలో 22,647 ఎకరాల్లో మామిడి తోటలు

చీపురుపల్లి: మామిడి పంటపై మంచు పగ పట్టింది. ఫిబ్రవరి నెల ముగుస్తున్నప్పటికీ ఇంకా దట్టంగా కురుస్తున్న మంచు మామిడి రైతులను కంటి మీద కునుకు లేకుం డా చేస్తోంది. రోజులు గడుస్తున్న కొద్దీ మంచు పెరుగుతుందే తప్ప తగ్గుముఖం పట్టకపోవడంతో పంట దిగుబడిపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. గత రెండు నెల లుగా కురుస్తున్న మంచు నుంచి మామిడి పూతను సంరక్షించుకునేందుకు రైతులు ఉద్యానవనశాఖాధికారులు చెప్పిన సస్యరక్షణ చర్యలన్నీ చేపట్టారు. అయినా పూత మాడడం, రాలడం తగ్గడం లేదు. చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో 22,647 ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. అత్యధికంగా మెరకముడిదాం మండలంలోనే 10,357 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. చాలా గ్రామాల్లో మామిడి పూతలు మాడిపోయి చెట్లు కళాహీనంగా కనిపిస్తున్నాయి.

సస్యరక్షణ కోసం అదనపు భారం

సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లోనే అధికంగా మంచు కురుస్తుంటుంది.అయితే ఈ ఏడాది మాత్రం ఫిబ్రవరి మూడో వారం నడుస్తున్నప్పటికీ ఇంకా రోజూ రాత్రి 8 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తునే ఉంది. పూత మాడిపోకుండా, పిందె కట్టిన చోట పిందెలు రంగు మారి రాలిపోకుం డా ఉండేందుకు రైతులు తరచూ పురుగు మందులను పిచికారీ చేస్తూనే ఉన్నారు. మామిడి తోటల సాగులో ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. కానీ ఈ ఏడాది మంచు పగబట్టడంతో సస్యరక్షణ కోసం ఎకరానికి కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పెట్టు బడి కోసం అప్పులు చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు కూడా పెరగడంతో రసం పీల్చే పురుగులు కూడా పంటను ఆశిస్తున్నాయి. వీటి నివారణకు మరింత ఖర్చయ్యే అవకాశం ఉంది.

యాభై శాతం దిగుబడి తగ్గే అవకాశం

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను గమనిస్తుంటే ఈఏడాది యాభై శాతం దిగుబడులు కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నా రు.మొదటి దశలో వచ్చిన పూత అంతగా నిలవకపోయినప్పటికీ ఫిబ్రవరి నెలలో వచ్చే రెండో దశ పూతపై ఆశలు పెట్టుకుని రైతులుఅప్పులు చేసి మరీ పెట్టుబడి పెట్టా రు.రెండో దశ పూతను కూడా మంచు వెంటాడుతుండడంతో అన్నదాతల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నట్టు యాభై శాతం పంట దిగుబడి తగ్గిపోతే అప్పులు పాలుకాక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మామిడి పంటను మంచు తీవ్రంగా వేధిస్తోంది. రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. సస్యరక్షణ పాటించకపోతే మరింత దిగుబడులు తగ్గిపోయే ప్రమా దం ఉంది. రైతులు ఫ్రూట్ కవర్లు కొనుగోలు చేసుకుని మామిడి పిందెలకు కట్టుకోవాలి. ఫ్రూట్ కవర్ల కోసం ఉద్యానవనశాఖ నుంచి ఎకరానికి రూ.4 వేల ఆర్థిక సహకారం అందించనున్నాం.

– సీహెచ్.చంద్రశేఖర్, హెచ్‌ఓ, చీపురుపల్లి



గరివిడి మండలంలోని వెదుళ్లవలసలో మామిడి పిందెలపై ఏర్పడిన మచ్చలు



గరివిడి మండలంలోని కొండదాడిలో పూత రాలిపోయిన చెట్లను పరిశీలిస్తున్న హెచ్‌ఓ

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ కేంద్రంలో సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ పంచాయతీ పరిధిలోని గాయత్రీ టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ జి.గిరిబాల మంగళవారం పరిశీలించారు. గాయత్రీ స్కూల్‌తో పాటు ఇతర పాఠశా లలకు చెందిన ఎంతమంది విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేశారని సిబ్బందిని ఆమె ఆరా తీశారు. సేవ లు పక్కాగా అందించాలని, ఎక్కడా తప్పులు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

కుర్చీలు, విద్యాసామగ్రి వితరణ



బాలమిత్ర ఫౌండేషన్ అందజేసిన చార్టులను చూపిస్తున్న విద్యార్థులు, ఎంఈఓ చంద్రశేఖర్

మెరకముడిదాం: మండలంలోని కొత్తకర్ర ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన బాలమిత్ర ఫౌండేషన్ రూ.20 వేల విలువ చేసే కుర్చీలు, గ్రీన్ చాక్ బోర్డులు, పెన్నులు, చార్టులు, తదితర సామగ్రిని వితరణ చేసింది. వాటిని ఎంఈఓ చంద్రశేఖర్ పాఠశాలకు మంగళవారం అందజేశారు. బాలమిత్ర ఫౌండేషన్ వారికి ఎంఈఓ,ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం టి.వి.వి.ఎల్. నరసింహం, సీఆర్‌ఎంటీ శంకరరావు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లల సమగ్రాభివృద్ధి కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని డీఈఓ మాణిక్యాలనా యుడు, సర్వశిక్ష అభియాన్ జీసీడీఓ పి.మాలతి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఏ.రామారావు, ఎంపీడీఓలు, ఎంఈఓలు కోరారు. చీపురుపల్లి, గజపతినగరం, గరివిడి, గంట్యాడ, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, దత్తిరాజేరు మండలాల అంగన్‌వా డీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి' కార్యక్రమంపై ఆరురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఆయా మండల కేంద్రాల్లో అధికారులు మంగళ వారం ప్రారంభించారు. కార్యక్రమం లక్ష్యాలను అధికారులు వివరించారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లల్లో మానసిక అభివృద్ధి చాలా కీలకమని, ఈ వయస్సులో పిల్లలు ఎక్కువగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని, వారిని చక్కగా తీర్చిదిద్దాలని చెప్పారు. చక్కని భాషను, నైతిక విలువలు, సామాజిక అంశాలపై పరిణితి పెంచాలని సూచించారు. ఆట,పాటలతో కూడిన విద్యను బోధించాలన్నారు. ఐసీడీఎస్, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జీసీడీఓ మాలతి



చీపురుపల్లిరూరల్(గరివిడి): అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న డీఈఓ మాణిక్యాలనాయుడు



గంట్యాడ: సూచనలు చేస్తున్న ఎంఈఓ -2 వెంకటరావు, అధికారులు



గజపతినగరం: మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంఈఓ శోభారాణి



దత్తిరాజేరు: శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు



వేపాడ: శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు

నేడు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికలు

- నియోజకవర్గ కేంద్రాల్లో జట్ల ఎంపిక

కొత్తవలస: కంటకాపల్లి గ్రామ సమీపంలోని శారద మెటల్స్,ఎల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో ఈనెల 21,22వ తేదీ ల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 9 నియోజకవర్గాల నుంచి జట్లను ఆహ్వానిస్తున్నామని, నియోజకవర్గస్థాయి జట్లను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం ఎంపిక చేయనున్నామని జాతీయ వాలీబాల్ కోచ్, విజయనగరం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రెసి డెంట్ గవర సూరిబాబు మంగళవారం తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డులు తీసుకురా వా లని సూచించారు. ఒక్కో జట్టుకు 10 మంది క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన 9జట్లకు ఈనెల 21,22వ తేదీల్లో కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేత జట్టుకు రూ.1.25 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.60,000, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.30,000, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25,000 చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రేపు

కొత్తవలస: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏఈ ఇమంది అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కొత్తవలస–విశాఖపట్నం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ,సాంకేతిక సభ్యురాలు బి.సురేఖా రాణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యుడు ఎస్.మురళీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. లోఓల్టేజ్, బిల్లుల్లో వ్యత్యాసం,విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం తదితర సమస్యలను వినియోగదారులు ఈ వేదిక దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



ఇంగ్లిష్ చార్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మెరకముడిదాం: పాఠశాల దశలోనే విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని మండలంలోని భైరీపురం బాదం పెంటయ్య హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఈశ్వర రావు అన్నారు. భాషోత్సవాల్లో భాగంగా పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మునాయుడు, ఎస్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ఆంగ్ల పదాలు, వ్యాకరణం, రైమ్స్‌తో కూడిన చార్టులను ప్రదర్శించారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు

వేపాడ: క్షయ(టీబీ) రహిత సమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేద్దామని వేపాడ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వేపాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరాలతో ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గ్రామం లో వైద్యసిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు .క్షయ రహిత భారతదేశానికి ప్రజలం తా సహకరించాలని వైద్యసిబ్బంది కోరారు.వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. హెచ్‌ఎం వెంకటరావు, హెల్త్ సూపర్‌వైజర్ వి.వి.రమణ, హెచ్‌ఏ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ మోహిని, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

• ప్రచార హోరు



చీపురుపల్లి: చీపురుపల్లి రామాంజనేయకాలనీ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు, తదితరులు



వేపాడ: విజయ గౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించాలని కోరుతూ ఆసంఘం నాయకులు చీపురుపల్లి, మెరకముడిదాం, కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్‌రాజు, జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ఆసంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పీడీఎఫ్ అభ్యర్థి కె.విజయ గౌరికి మద్దతుగా వేపాడ మండలంలోని సోంపురం, దబ్బిరాజుపేట, భర్తవానిపాలెం, వీలుపర్తి, నీలకంఠరాజపురం, బానాది, పాటూరు, బొద్దాం, వీరనారాయణం తదితర గ్రామాల్లో సీఐటీయూ నాయకుడు చల్లా జగన్, యూటీఎఫ్ నాయకులు ప్రచారం చేశారు.విజయగౌరికి ఓటువేయాలని ఉపాధ్యా యులను కోరారు.

– చీపురుపల్లి/మెరకముడిదాం/లక్కవరపుకోట/కొత్తవలస/వేపాడ

పుణ్యగిరి జాతరకు ఏర్పాట్లు



ఎస్.కోటలో రోడ్లు శుభ్రం చేస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: శివరాత్రి రోజున పట్టణంలోని పుణ్యగిరిలో జాతర నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక పోలీసులు, పంచాయతీ ఉద్యోగులు కలిసి పట్టణంలో పనులు ప్రారంభించారు. సీఐ వెంకటరమణ, పంచాయతీ ఈఓ అనూరాధ నేతృత్వంలో డోజర్లతో రోడ్ల పక్కల ఉన్న బెర్మ్‌లు శుభ్రం చేయించారు. రోడ్డు పక్కల ఉన్న ఆక్రమణలు తీయించి, జాతరకు వచ్చే జనానికి ఇబ్బందులు లేకుండా పనులు చేయించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు.

జర్నలిస్టుపై దాడి హేయం



తహసీల్దార్ అజూ రఫీజాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

మెరకముడిదాం: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై ఆ మండలానికి చెందిన టీడీపీ అధ్యక్షుడు దాడి చేయడం హేయమైన చర్య అని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని మెరకముడిదాం మండల విలేకరులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి విలేకరిపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అజూ రఫీజాన్‌కు వినతిపత్రం అందజేశారు. విలేకరులు ఎస్.వి.సత్యనారాయణరాజు, పల్లి ఉమామహేశ్వరరావు, తాడేల శంకరరావు, ఆర్.తవిటయ్య, బూటు శ్రీనివాసరావు, పల్ల ఆదినారాయణ, విననగిరి శంకరరావు పాల్గొన్నారు.

మోతాదు మించితే అనర్థమే



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు చంద్రశేఖర్

గజపతినగరం రూరల్: పంటలకు మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగిస్తే అన్ని విధాలా అనర్థమేనని, భూసారం కూడా తగ్గిపోతుందని జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని శ్రీరంగరాజపురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు పంటలకు ఎరువులు వేయాలన్నారు. రైతులు అంతా భూ ఆధార్ కోసం తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని సూచించారు. డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేసే విధానం, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. గజపతినగరం ఏడీఏ మహరాజన్ మాట్లాడుతూ ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రాయితీపై డ్రిప్,స్ప్రింకర్ల పరికరాలను అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ ధనలక్ష్మి, స్థానిక సర్పంచ్ కామునాయుడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ యామిని, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్

శృంగవరపుకోట: కృష్ణాపురం గ్రామంలో సర్పంచ్ మేడపురెడ్డి యామినీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ మంగళవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. కొత్తగా వాటర్ ట్యాంక్ నిర్మించిన స్థలంలో, ఆంజనేయస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలాల్లో ఉన్న చెత్తను జేసీబీ తీయించారు. ట్రాకర్లతో చెత్తను గ్రామానికి దూరంగా తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు

గజపతినగరం రూరల్: ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ రత్నకుమార్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక పీఓ, ఒక ఏపీఓ, ముగ్గురు ఓపీఓ లు పోలింగ్ విధులు నిర్వర్తిస్తారని, మండలంలో 146 మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉందని చెప్పారు. ఈనెల 26న ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.